సాక్షి
శ్రీకాకుళం
బుధవారం : 30 : జూలై : 2025



పోరుబాటలో అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలు పోరుబాట పట్టారు. డిమాండ్ల సాధనకు నినాదాలు వినిపిస్తున్నారు.

- 8లో



వ్యాన్ బీభత్సం

జేఆర్ పురంలో వ్యాన్ బీభత్సం సృష్టించింది. లారీ, రెండు బైక్‌లను ఢీకొట్టింది.

- 8లో

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్దగల జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యాసంవత్సరానికి గాను 6 వతరగతిలో ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తు గడువు ఆగస్టు 13 వరకు పెంచినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ జి.బేతన సామి తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని త్వరగా దరఖాస్తు చేయాలని సూచించారు.

న్యూస్‌రీల్


బ్యాంకు చిరుద్యోగికి రూ.11.50 లక్షలకు టోకరా



రణస్థలం: ఎస్‌బీఐలో తాత్కాలిక పద్ధతిన పని చేస్తున్న ఓ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి రూ.11.50 లక్షలు పోగొట్టుకున్నాడు. జేఆర్ పురం పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని కొచ్చెర్ల గ్రామానికి చెందిన దుంప కృష్ణ చిత్తూరు జిల్లాలోని మెట్టూరు ఎస్బీఐ బ్యాంకులో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నాడు. వాట్సాప్ ద్వారా వచ్చే వీడియోలు చూసి సబ్ స్క్రైబ్ చేసుకుంటే ఆయనకు డబ్బులు వచ్చేవి. దీంతో ఇంకా డబ్బులు ఇస్తామని చెప్పి సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్ ద్వారా లింకులు పంపించి గేమ్‌లు ఆడించేవారు. అందులోనూ కొన్ని బహుమతులు, కొంత డబ్బులు వచ్చినట్లు చూపించేవారు. ఇలా రూ. 40వేలు కడితే రూ. 70వేలు రావటం, ఇంకా ఎక్కువ కడితే ఎక్కువ వస్తుందని ఆన్‌లైన్‌లో చూపించేవారు. కానీ డబ్బులన్నీ వ్యాలెట్‌లో పడేవి తప్ప చేతికి వచ్చేవి కావు. గెలుచుకున్న డబ్బులు రావాలంటే మరికొంత కట్టాలని, అలా కడితే వెంటనే అకౌంట్‌లో డబ్బు పడుతుందని చెప్పేవారు.

దీంతో ఆయన ఈ మోసానికి బలైపోయి జూలై 13 నాటికి రూ. 11.50లక్షలు నష్టపోయాడు. అప్పు చేసి మరీ ఆయన ఆన్‌లైన్ గేమ్స్ ఆడాడు. తీరా మోసపోయానని తెలిసి ఒత్తిడికి గురై ఇంటి వాళ్లకు ఫోన్ చేయకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. చిత్తూరు వెళ్లి కృష్ణను తీసుకువచ్చారు. జరిగిన మోసంపై పూర్తి వివరాలతో జేఆర్ పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును చిత్తూరు జిల్లా మెట్టూరుకు బదిలీ చేసినట్లు జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

పీ–4 భారం.. బోధనకు దూరం



- ప్రభుత్వ ఉపాధ్యాయులకు పీ–4 దత్తత బాధ్యతల అప్పగింత
- విద్యార్థుల కుటుంబాలను దత్తత తీసుకోవాలంటూ హెచ్‌ఎం, టీచర్లకు ఆదేశాలు
- ఇప్పటికే పలు యాప్‌లతో పెరిగిన పని భారం
- మానసిక క్షోభకు గురి చేయవద్దంటున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట:

సర్కారు టీచర్ల నెత్తిన ప్రభుత్వం నిత్యం కొత్త భారాలు వేస్తోంది. ఇప్పటికే పలు యాప్‌ల నిర్వహణలతో టీచర్లపై విపరీతమైన భారం ఉంది. దీనికి అదనంగా ప్రభుత్వం పీ–4 బాధ్యతలను కూడా ఉపాధ్యాయులకు అప్పగించింది. ప్రతి ఉపాధ్యాయుడు కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని, ఆ కుటుంబాలను బంగారు కుటుంబాల పేరుతో వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులు ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తున్నారు. ప్రధాన ఉపాధ్యాయులు కనీసం ఐదు కుటుంబాలను, ఉపాధ్యాయులు కనీసం రెండు కుటుంబాలను దత్తత తీసుకొని రిజిస్టర్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంపై ఉపాధ్యాయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

తరగతులపై ప్రభావం

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు బోధనేతర విధులతో ఇప్పటికే సతమతమవుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి యోగాంధ్ర, పేరెంట్ మీటింగ్స్, యాప్‌లు, శిక్షణ, ఫొటోల అప్‌లోడ్ వంటి పనులు అప్పగించడంతో వీరంతా విసుగు చెందుతున్నారు. దీని ప్రభావం తరగతుల నిర్వహణపై పడుతోంది. బోధన సమయం తగ్గిపోయి మొక్కుబడిగా పాఠాలు చెప్పే పరిస్థితి స్కూల్స్‌లో నెలకొంది. దీనిపై ఒక వైపు ఉపాధ్యాయ సంఘాలు ఫ్యాప్టోగా ఏర్పడి ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే.. తాజాగా ప్రభుత్వం పీ–4 పిడుగును వారి నెత్తిన వేసింది. దీంతో ఉపాధ్యాయ సంఘాలన్నీ ఏకమై నిరసన రాగం వినిపిస్తున్నాయి. మధ్య తరగతి శ్రేణిలో ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు వేరే కుటుంబాలను దత్తత తీసుకొని ఆర్థిక సాయం చేసే పరిస్థితి ఉండదనే నిజాన్ని ప్రభుత్వ పెద్దలు తెలుసుకోవాలని టీచర్ల సంఘ నాయకులు చెబుతున్నారు. యాప్‌లో 70 రకాలకు పైగా ఉన్న టైల్స్ రద్దు చేసి బోధనా స్వేచ్ఛ కల్పించి, పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు మరింత దగ్గర చేయాలని కోరుతున్నారు.

పీ–4 పక్కాగా అమలు చేయాలి: కలెక్టర్



శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలనకు కూటమి ప్రభుత్వం పీ–4 విధానం ప్రవేశపెట్టిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 75,566 బంగారు కుటుంబాలను, 5171 మార్గదర్శకులను గుర్తించామని, ఇందులో 24 వేల కుటుంబాలను దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు వచ్చారని, వారికి అనుసంధానం చేసినట్లు చెప్పారు. ప్రణాళిక విభాగం సారథ్యంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సర్వే చేసి నిరుపేద కుటుంబాలను గుర్తించారని, ఆగస్టు 15వ తేదీ లోపు జిల్లాలో ఇంత వరకు గుర్తించిన 75 వేల కుటుంబాలను దత్తత తీసుకొనే కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఒత్తిడి చేయడం సరికాదు



పీ–4పై ఉపాధ్యాయ వర్గాలు ఒత్తిడికి గురవుతున్నాయి. ఇప్పటికే హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై అనేక రకాలుగా బోధనేతర బాధ్యతలు పెంచుతున్నారు. వీటితోనే సతమతమవుతుంటే మళ్లీ పీ–4 పేరున అదనపు భారం పెట్టడం సరికాదు.

–బమ్మిడి శ్రీరామ్మూర్తి, ఫ్యాప్టో చైర్మన్, శ్రీకాకుళం

టీచర్లపై రుద్దడం అన్యాయం



పీ–4 కార్యక్రమం పేరిట ఉపాధ్యాయులు కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని చెబుతున్నారు. ఇది అన్యాయం. టీచర్లను బోధనకు మాత్రమే పరిమితం చేయాలి. ఉపాధ్యాయ వర్గాలు కూడా మధ్య తరగతి శ్రేణులకు చెందిన కుటుంబాలే అనే విషయాన్ని ప్రభుత్వం గమనించాలి.

– తమ్మినాన చందనరావు, ఏపీఎస్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



విద్యార్థుల కుటుంబాలను దత్తత తీసుకోవాలని, వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి చేయడం బాధాకరం. బోధనేతర కార్యక్రమాలతో ఇప్పటికే పాఠాలను సక్రమంగా బోధించలేక ఒత్తిడికి గురి అవుతున్నాం. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

– బి.కేశవరావు, మండల శాఖ అధ్యక్షుడు ఏపీటీఎఫ్ (1938), నరసన్నపేట

ప్రభుత్వ భూమి కాజేసే కుట్ర



- నకిలీ పత్రాలతో స్వాధీనానికి ప్రయత్నం
- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన మల్లికార్జునపురం గ్రామస్తులు

హిరమండలం: ఎల్‌ఎన్‌పేట మండలం మల్లికార్జునపురం రెవెన్యూ పరిధిలో ఓ ఘరానా మోసం వెలుగు చూసింది. 2.80 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు తీవ్రమైన ప్రయత్నాలు జరగడంతో స్థానికులు కలెక్టరేట్‌ను ఆశ్రయించారు. మల్లికార్జునపురం రెవెన్యూ పరిధిలోని అటవీ భూములు ఉన్నాయి. అయితే అందులో సర్వే నంబర్ 17/3ఏ పరిధిలో 2 ఎకరాల 10 సెంట్లు, 161/3ఏలో 70 సెంట్లు భూమిని కోట సూర్యనారాయణ అనే వ్యక్తికి ప్రభుత్వం డీ పట్టా కింద మంజూరు చేసిందని చూపిస్తూ.. రూ.2కోట్లకుపైగా విలువైన ఈ భూమిని కాజేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే గత కొద్దిరోజులుగా దీనిపై వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో టెక్కలి ఆర్డీఓ మండల రెవెన్యూ అధికారులను పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించారు.

తాజాగా ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు కోట సూర్యనారాయణ కుమారుడు శ్రీనివాసరావు అనే హోంగార్డ్ ప్రయత్నించాడు. దీంతో గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదుచేశారు. అయితే ఈ మొత్తం వ్యవహారంలో బొర్రంపేట సచివాలయంలో పనిచేస్తున్న వీఆర్‌ఏ సైలాడ దుర్గారావు సూత్రధారి అని ఆరోపిస్తున్నారు. హోంగార్డుగా పనిచేస్తున్న కోట శ్రీనివాసరావుతో కలిసి ఈ అటవీ భూమిపై కన్నేసినట్టు తెలుస్తోంది. దాదాపు దశాబ్దం కిందటే చనిపోయిన సూర్యనారాయణ పేరు మీద ఈ భూమి ఉందని చూపిస్తూ కొట్టేసే విధంగా ఇద్దరూ ప్లాన్ చేసుకున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. అప్పటి ఉమ్మడి సరుబుజ్జిలి మండలం డీపట్టా రిజిస్టర్‌లో ఫోర్జరీ చేసి పేర్లు తారుమారు చేసి రూ.2 కోట్ల విలువైన ఆస్తిని కాజేసే కుట్ర జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని మల్లికార్జునపురం, బొర్రంపేట గ్రామస్తులు కోరుతున్నారు.



తప్పుడు పత్రాలతో స్వాధీనం చేసుకోవాలని చూస్తున్న ప్రభుత్వ డీపట్టా భూమి

చర్యలు తీసుకుంటాం..



మల్లికార్జునపురం భూములకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిని ఆక్రమించడం నేరం. దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం.

– జె.ఈశ్వరమ్మ తహసీల్దారు, ఎల్‌ఎన్‌పేట

'భూమి డిజిటలైజేషన్ తప్పనిసరి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: భూములు తప్పనిసరిగా డిజిటలైజేషన్‌లో ఉండాలని కేంద్ర బృందం సభ్యులు సునీల్‌బోంతా, నాతుసింగ్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయాన్ని వారు సందర్శించారు. జిల్లాలోనూ, శ్రీకాకుళం తహసీల్దారు కార్యాలయం పరిధిలోనూ గత ల్యాండ్ డిజిటలైజేషన్ వివరాలను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు వారికి వివరించారు. 1863 రెవెన్యూ గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేశామని, వీటితో పాటు ఎఫ్ఎంబీ, ఎస్ఎల్ఆర్ వంటివి కూడా డిజిటలైజేషన్‌లో పొందుపర్చామని డీఆర్ఓ వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.గణపతిరావు, డీడీ ఎస్.చక్రవర్తి తదితరులు ఉన్నారు.

ఏదో చెప్పకో లేఖ..

- వీడ్కోలు సన్మానాలు వద్దు.. విరాళాలు ముద్దు అంటున్న డీఈవో
- ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులకు లేఖ

శ్రీకాకుళం: జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. అయితే తన ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు సన్మానాలు చేయవద్దని, దీనికి బదులుగా తాను సంఘ సేవ కోసం నెలకొల్పిన పుష్పాంజలి అనే ట్రస్టుకు విరాళాలు ఇవ్వాలని కోరుతూ ఆయన ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులకు లేఖ రాయడం చర్చనీయాంశమైంది. ఈ ఏడాది మార్చిలో 10వ తరగతి పరీక్షల సందర్భంగా కుప్పిలిలో జరిగిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో పాటు ఉపాధ్యాయ రంగం అంతా ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆయన ఇలాంటి లేఖ రాయడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. 11,000 మంది ఉద్యోగులు ఉన్న కుటుంబం లాంటి విద్యా శాఖలో ప్రతి ఒక్కరూ 10 చొప్పున విరాళం ఇచ్చినా సంఘసేవను తక్షణం ప్రారంభించే వీలు ఉంటుందని లేఖలో తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడకుండా ఉండడం కోసమే ట్రస్టును ఏర్పాటు చేసినట్లు చెబుతూ తొలిగా తాను రూ.లక్ష జమ చేస్తున్నానని, ప్రతి నెల రూ.5000 చొప్పున జమ చేస్తానని తెలిపారు.



డీఈవో లేఖ ఇదే

లేఖపై తీవ్ర చర్చ

ఉద్యోగ విరమణ సందర్భంలో విద్యాశాఖతో పాటు ఇతర ఏ శాఖల అధికారులూ ఇలాంటి లేఖ రాసిన సందర్భాలు లేవు. తిరుమల చైతన్య రాసిన లేఖపై పలువురు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. కుప్పిలిలో జరిగిన సంఘటన తర్వాత ఉపాధ్యాయ వర్గంలోని 98 శాతం మంది వ్యతిరేకులయ్యారు. విద్యాశాఖ అధికారి పదవీ విరమణ చేసిన సందర్భంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు సన్మానాలు, సత్కారాలు చేయడం పరిపాటి. విద్యాశాఖ కూడా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వీడ్కోలు సభను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఉపాధ్యాయ సంఘాలు సత్కారాలు చేయడానికి సుముఖత చూపించడం లేదు. ఈ విషయం గ్రహించిన తిరుమల చైతన్య ముందుగా తానే సత్కారాలు వద్దనేస్తే బాధ పోతుందని ఈ లేఖ రాశారని ఓ వర్గం అభిప్రాయపడుతోంది. సంఘ సేవ పేరుతో విద్యా శాఖను వదలకుండా అంటిపెట్టుకొని పెత్తనం చెలాయించవచ్చని భావిస్తూ ట్రస్టును నెలకొల్పారు అన్న వాదనను మరో వర్గం వినిపిస్తోంది. ట్రస్టును రిజిస్టర్ చేసిన సందర్భంలో దానికి పాన్ కార్డును అనుసంధానం చేయడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో తనకు ఉన్న పరిచయాలతో ఇన్‌కమ్ టాక్స్ రాయితీని ట్రస్టుకు తెచ్చుకొని ఉద్యోగ ఉపాధ్యాయుల నుంచి సంవత్సరం చివరిలో చెల్లించే ఇన్‌కమ్ ట్యాక్స్‌కు బదులుగా ఆ మొత్తాన్ని ట్రస్టుకు జమ చేయాలని అడగవచ్చునన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఉద్యోగ విరమణ సందర్భంలో ఓ లేఖను విడుదల చేసి డీఈవో జిల్లాలో ఓ కొత్త చర్చను లేవనెత్తారు.



దారి ఇలా.. బడికి వెళ్లేదెలా..?

ఇచ్ఛాపురం మండలంలోని ముచ్చింద్ర ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు పిల్లలు నానా అవస్థలు పడుతున్నారు. చిన్న చినుకు పడినా ఈ దారి దారుణంగా మారుతోంది. దీనికి తోడు బడికి వెళ్లే రహదారి దళిత వాడ వద్ద మురుగునీరు నిల్వ కావడంతో పిల్లలు అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

'ఖాతాదారులకు న్యాయం చేస్తాం'

ఇచ్ఛాపురం: స్థానిక సబ్‌పోస్టాఫీస్‌లో జరిగిన భారీ స్కామ్ దృష్ట్యా ఖాతాదారులందరికీ న్యాయం చేస్తామని పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు అన్నారు. స్థానిక సబ్‌పోస్టాఫీస్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మోసానికి పాల్పడిన వారిని ఎవరినీ వదలబోమని, ప్రతి పైసా రికవరీ చేస్తామని తెలిపారు. పోస్టల్ ఖాతాలకు ఫోన్ నంబర్లను లింక్ చేసుకోవాలని, అందుకోసం పోస్టాఫీస్ వద్ద ప్రత్యేక కౌంటర్‌ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోస్టల్‌లో పని చేస్తున్న కొందరు దురాశతో సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి ఈ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడినట్లు పోస్టల్ ఎస్పీ గుర్తించారని తెలిపారు. 33 ఖాతాల నుంచి రూ.2కోట్ల78 లక్షలు మాయమైనట్లు పోస్టల్ ఎస్పీ వెల్లడించారు. పోస్టాఫీస్‌లో కిసాన్‌వికాస్ పత్ర (కేవీపీ) ద్వారా డబ్బులు కట్టించిన ఏజెంట్లు ఖాతాదారుల ఖాతాలు పరిశీలించుకోవాలని సూచించారు. పోస్టాఫీస్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయనున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ద్విచక్ర వాహనం ధ్వంసం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడికి ప్రయత్నించిన టీడీపీ నాయకుడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

టెక్కలి: మండలంలోని అయోధ్యపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త దుంపల ఈశ్వరరావుపై అదే గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త టీడీపీ నాయకుడు బగాది హరి మంగళవారం ఇనుప రాడ్డుతో దాడికి ప్రయత్నించాడు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త తప్పించుకుని తన ఇంటిలోకి వెళ్లిపోవడంతో బయట ఉన్న ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశాడు. ఈ మేరకు బాధితుడు ఈశ్వరరావు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హెచ్.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్, వైస్ ఎంపీపీ పి.రమేష్, జిల్లా నాయకుడు సత్తారు సత్యంతో పాటు మరి కొంత మంది మండల నాయకుల సహకారంతో మంగళవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను ఇంటి వద్ద నిలుచుని ఉండగా టీడీపీ నాయకుడు బగాది హరి ఇనుప రాడ్డు పట్టుకుని దాడి చేసేందుకు ప్రయత్నించాడని, ఆ దాడి నుంచి తప్పించుకుని ఇంట్లో తలదాచుకున్నానని, దీంతో ఇంటి బయట ఉన్న తన ద్విచక్రవాహనాన్ని రాడ్డుతో ధ్వంసం చేశాడని బాధితుడు ఈశ్వరరావు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బగాది హరి నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన బగాది హరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు అందజేసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె.అజయ్, వి.శ్రీధర్‌రెడ్డి, వి.తవిటయ్య, బి.రాజేష్, బి.కార్తీక్, మోదుగువలస గణపతిరావు, ఎం.రమేష్, ఎం.కృష్ణ ఉన్నారు.



బాధితుడితో కలిసి ఫిర్యాదు చేసేందుకు టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

ట్రాక్‌కు మరమ్మతులు.. నిలిచిన వాహనాలు



రైల్వే ట్రాక్ మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురం–పురుషోత్తపురం మధ్య ఎల్‌సీ గేట్‌ను రైల్వే అధికారులు మంగళవారం సాయంత్రం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు మూసివేశారు. ట్రాక్ మరమ్మతుల సమాచారాన్ని వాహనదారులకు ముందుగానే అధికారులు తెలియజేశారు. దీంతో కేదారిపురం, ముచ్చింద్ర, బెన్నుగానిపేటకు చెందిన విద్యార్థులను రెండో పూటే ఇళ్లకు పంపించేశారు. మిగిలిన వాహనాలు బెన్నుగానిపేట మీదుగా ఇచ్ఛాపురం చేరుకున్నాయి

పూడిలంక వంతెన పనులు పూర్తిచేస్తాం

వజ్రపుకొత్తూరు: పూడిలంక వంతెన పనులు స్వయంగా పర్యవేక్షించి పూర్తి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రూ.4 కోట్లతో నిర్మించనున్న పూడిలంక వంతెన నిర్మాణ పనులకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి మంత్రి మంగళవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంచినీళ్లపేట జెట్టీ నిర్వహణకు కేంద్ర మంత్రితో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ పూడిలంక వంతెన పనులు పూర్తి చేసి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిమ్మల కృష్ణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కణితి సురేష్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పి.ఈశ్వరరావు, సైని భాస్కరరావు, టి.గణపతి, రంగారావు, హేమారావు తదితరులు పాల్గొన్నారు.

'గోవిందరాజులు వ్యాఖ్యలు అర్థరహితం'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కళింగ వైశ్య రాష్ట్ర అధ్యక్షునిగా ఉంటూ వైఎస్సార్‌సీపీపై బోయిన గోవింద రాజులు చేసిన వ్యాఖ్యలు అర్థ రహితమని, ఇదే సంఘంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధులుగా ఉన్న తమ మనోభావాలు తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని రాష్ట్ర వైఎస్సార్ సీపీ కళింగ వైశ్య బీసీ అనుబంధ సాధికార కమిటీ అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ కోశాధికారి తంగుడు నాగేశ్వరరావు, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కోరాడ చంద్రభూషణగుప్త, వైఎస్సార్‌సీపీ నాయకులు తంగుడు జోగారావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొందరికి పదవులు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేయడంలో ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ ఏ రాజకీయ పార్టీ ఇలాంటి అవకాశాలు కల్పించలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 1999లో ఎన్డీఏ ప్రభుత్వంతో సీట్లు సర్దుబాటు చేసుకొని మిత్రపక్షంగా ఉంటూ విజయం సాధించిన తర్వాత టీడీపీ కేంద్ర క్యాబినెట్‌లో చేరకపోవడానికి కారణాలను మీ పార్టీ పెద్దలను అడిగి తెలుసుకొని సమాజానికి తెలియజేయాలని కోరారు. బీసీలను బ్యాక్‌బోన్‌గా గుర్తించిన ఏకైక పార్టీ వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి కళింగవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, 10 కుల కార్పొరేషన్ డైరక్టర్లను, నాలుగు బిజినెస్ కార్పొరేషన్ డైరక్టర్లను, బీసీ కళింగ వైశ్య మహిళకు శ్రీకాకుళం సుడా చైర్మన్ ఇచ్చి కళింగ వైశ్యులను గుర్తించారన్నారు. కూటమి పాలన 14 నెలల్లో పలాసలోని ఒక్క ఏఎంసీ పదవి తప్ప గతంలో ఉన్న మల్లా శ్రీనివాసరావుని కూడా తిరిగి నియమించలేదన్నారు.

టి.డి.వలసలో జ్వరాలపై సర్వే



ఇంటింటా వివరాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

జి.సిగడాం: టంకాల దుగ్గివలస గ్రామంలో జ్వరాలపై వైద్యసిబ్బంది మంగళవారం ఇంటింటా సర్వే చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జ్వరపీడితుల వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తామని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, వైద్యాధికారి బి.యశ్వంత్ కుమార్ తెలిపారు. ఇప్పటికే గ్రామంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశామని, పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నామని చెప్పారు.



పోరుబాటలో అంగన్‌వాడీలు

- సమస్యల పరిష్కారంలో ఉదాసీనంగా రాష్ట్ర ప్రభుత్వం
- కూటమి పాలకుల తీరుపై మండిపడుతున్న అంగన్‌వాడీలు
- ఇప్పటికే ఐసీడీఎస్, కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు
- ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరిక

శ్రీకాకుళం అర్బన్ :



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు పోరుబాటకు సిద్ధమౌతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరుతూ ఇప్పటికే కలెక్టరేట్, ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టారు. అయినా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడంతో రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టేందుకు వెనుకాడేది లేదని అంగన్‌వాడీలు హెచ్చరిస్తున్నారు. కూటమి పాలన వచ్చి ఏడాది గడచినా ఎన్నికల నాటి హామీల ఊసే ఎత్తకపోవడంపై సిబ్బంది మండిపడుతున్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీలకు తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు వర్తింపజేయకపోవడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాప్‌ల భారం తగ్గించాలి..

ముఖ గుర్తింపు విధానం తక్షణమే రద్దు చేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు. 2022లో ఇచ్చిన మొబైల్ ఫోన్‌లో యాప్‌లు పనిచేయడం లేదని, యాప్‌లో అప్‌లోడ్ చేయకపోతే సరుకులు ఇవ్వబోమని చెప్పడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రాంతాలలో సిగ్నల్స్ రాక అనేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. తక్షణమే గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	16
అంగన్‌వాడీ కేంద్రాలు	2759
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	580
అంగన్‌వాడీ కార్యకర్తలు	3339
అంగన్‌వాడీ సహాయకులు	2759



శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

ప్రధాన డిమాండ్లు ఇవే..

- నెలకు రూ.26వేలు కనీస వేతనం, పెన్షన్, సామాజిక భద్రత సదుపాయాలు, గ్రాట్యుటీ వంటివి అమలు చేయాలి
- టేక్ హోం రేషన్, ఇతర సేవల కోసం ఎఫ్ఆర్ఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసే నిబంధన అమలును వెంటనే ఆపాలి.
- అంగన్‌వాడీ రిపోర్టింగ్ విధానం డిజిటలైజేషన్ అమలుకు ముందే ఆయా కేంద్రాలన్నింటికీ కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు అందించాలి.
- అంగన్‌వాడీ కేంద్రాలలో ఫ్రీ వై–ఫై అందించాలి. డేటాకు సరిపడా నగదు చెల్లించాలి.
- సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆధార్ ధ్రువీకరణ, ముఖ గుర్తింపు వంటివి ఏమీ లేకుండానే లబ్ధిదారులందరికీ నాణ్యమైన అనుబంధ పోషకాహారం అందించేలా వీలు కల్పించాలి.
- పోషణ్ ట్రాకర్ యాప్ సమస్యలపై చర్చించడానికి అంగన్‌వాడీ ఫెడరేషన్స్‌తో కలిపి సమావేశం నిర్వహించాలి.

రద్దు చేయాలి..



అంగన్‌వాడీలకు భారంగా మారిన ఎఫ్ఆర్ఎస్(ముఖ కవలికల గుర్తింపు) విధానం తక్షణమే రద్దు చేయాలి. నాణ్యమైన సెల్ ఫోన్‌లు, నెట్ కనెక్షన్లు అందించాలి. వివిధ కారణాల వల్ల రిజిస్టర్ కాని అంగన్‌వాడీ లబ్ధిదారులకు మాన్యువల్‌గా రేషన్ అందించేందుకు అవకాశం కల్పించాలి.
– కె.కల్యాణి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

నిర్లక్ష్యం తగదు..



సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.26 వేలు అందించాలి. పీఎఫ్, ఉద్యోగ భద్రత, గ్రాట్యుటీ అందించాలి. రాజకీయ వేధింపులు ఆపాలి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదు.
– డి.సుధ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

పథకాలు వర్తింపజేయాలి..



అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలి. తల్లికి వందనం పథకం ఇవ్వకపోవడం సరికాదు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. సెంటర్ మెయింటెనెన్స్ చార్జీలు చెల్లించాలి. అవసరమైతే కేంద్రంతో మాట్లాడి ఎఫ్ఆర్ఎస్ విధానం రద్దు చేయాలి. – టి.రాజేశ్వరి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు

జె.ఆర్.పురంలో వ్యాన్ బీభత్సం

- లారీ, రెండు బైకులను ఢీకొట్టిన వైనం
- డ్రైవర్‌కు దేహశుద్ధి చేసిన స్థానికులు

రణస్థలం: రణస్థలంలో జాతీయ రహదారిపై ఐషర్ వ్యాన్ బీభత్సం సృష్టించింది. విశాఖపట్నం వైపు నుంచి నరసన్నపేట వెళ్తున్న ఈ వ్యాన్ మంగళవారం సాయంత్రం దన్నానపేట వద్ద ద్విచక్ర వాహనంపై వస్తున్న ఈసర్ల రాంబాబు అనే వ్యక్తిని ఢీకొట్టింది. కొంతదూరం ముందుకొచ్చి ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. అక్కడితో ఆగకుండా అత్యంత రద్దీగా ఉండే రామతీర్థాలు కూడలి వద్ద మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్‌కు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వ్యాన్ ఆగకపోతే పెను ప్రమాదం జరిగేది. జె.ఆర్.పురం పోలీసులులు స్పందించి జేసీబీ సాయంతో వ్యాన్‌ను పక్కకు నెట్టారు. ఈ ఘటనలో లావేరు మండలం పైడియ్యవలసకు చెందిన ఈసర్ల రాంబాబుకు తీవ్ర గాయాలు కావడంతో రణస్థలం సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన ఐషర్ వ్యాన్

ఆదర్శ విప్లవకారుడు మాధవరావు

పలాస: పేద కటుంబంలో పుట్టి జీవితాంతం ప్రజల కోసం పనిచేసిన ఆదర్శ విప్లవకారుడు గోరు మాధవరావు అని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పి.డి.ఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు చెప్పారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో మంగళవారం గోరు మాధవరావు, ఎన్.క్రాంతికుమార్‌ల సంస్మరణ సభ నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. పి.డి.ఎం.జిల్లా నాయకుడు సాలిన వీరాస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎ.ఐ.ఆర్.పి.ఎఫ్ ఆలిండియా అధ్యక్షుడిగా పనిచేసిన మాధవరావు అంతకుముందు శ్రీకాకుళం ఉద్యమంలో కూడా పాల్గొన్నారని, సుమారు 50 ఏళ్ల ప్రజల కోసం పనిచేసి జైలు జీవితం అనుభవించారని చెప్పారు. క్రాంతికుమార్ పి.డి.ఎం.లో పనిచేశారని, అతని త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో అమరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర నాయకుడు జోగి కోదండరావు, పౌర హక్కుల సంఘం నాయకుడు స్వామినాథం, పి.కె.ఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, మురిపింటి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాలిన వీరాస్వామి

3న జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి జూనియర్స్ చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆగస్టు 3న నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్ మంగళవారం తెలిపారు. శ్రీకాకుళం కొత్త రోడ్డు సమీపంలో ఉన్న సీఎస్ఎస్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జరిగే ఈ ఎంపికలకు 19 ఏళ్లలోపు బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. విజేతలను త్వరలో కర్నూలు వేదికగా జరిగే ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్స్ చెస్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు పంపిస్తామని ఆల్ ఇండియా చెస్ ఇన్ స్కూల్ కమిటీ సభ్యులు సనపల భీమారావు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన బాలబాలికలు జనన ధృవీకరణ పత్రం, రూ.300 ఎంట్రీ ఫీజుతో హాజరుకావాలని, పూర్తి వివరాలకు 9912559735 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొట్లాట కేసులో నిందితుడికి జైలుశిక్ష

సంతబొమ్మాళి: కొట్లాట కేసులో నేరం రుజువు కావడంతో నౌపడ గ్రామానికి చెందిన రోకళ్ల ఎర్రన్నకు కోటబొమ్మాళి ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.రోషిని రెండు నెలల జైలు శిక్ష విధించినట్లు నౌపడ ఎస్ఐ నారాయణస్వామి మంగళవారం తెలిపారు. నౌపడ గ్రామానికి చెందిన చెన్నూరి వెంకట్‌రాజుపై ఎర్రన్న దాడి చేయడంతో కేసు నమోదైందని, నేరం రుజువు కావడంతో శిక్ష పడిందని చెప్పారు.

ఇసుక ర్యాంపు తాత్కాలికంగా నిలుపుదల

కొత్తూరు: కొత్తూరు మండలంలోని బలద రెవెన్యూ గ్రామం పరిధిలోని వంశధార నదిలో వసప గ్రామం సమీపంలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపును తాత్కాలికంగా నిలిపివేసినట్లు స్థానిక తహసీల్దార్ కె.బాలకృష్ణ తెలిపారు. ఇసుక ర్యాంపు నుంచి వసప గ్రామానికి చెందిన రైతుల పంట పొలాల దారి మీదుగా ఇసుక టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండడంతో రైతులు నిరసన తెలిపి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఇసుక ర్యాంపులో అక్రమ తవ్వకాలను ఈ నెల 27 తేదీన పరిశీలించారు. దీనిపై తహసీల్దార్ బాలకృష్ణ మంగళవారం ఇసుక ర్యాంపును, పంట పొలాల మధ్య నుంచి ఇసుక వాహనాలు వెళ్తున్న దారిని పరిశీలించారు. రోడ్డు ఇరుకైపోయి పొలం పనులకు వెళ్లలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సమస్యతో పాటు ఇసుక తవ్వకాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని, వారం రోజుల పాటు ర్యాంపును తాత్కాలికంగా నిలుపుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు.



తహసీల్దార్‌కు సమస్య వివరిస్తున్న రైతులు

మందులు తయారీదారుడికి జరిమానా

శ్రీకాకుళం క్రైమ్ : ఔషధ చట్టం నిబంధనలు అతిక్రమించినందుకు సన్‌రైజ్ ఇంటర్నేషనల్ ల్యాబ్స్ లిమిటెడ్ కంపెనీ, సంబంధిత యజమాని మనోష్‌కుమార్ రాంబల్‌కు రూ.50 వేలు జరిమానా, ఒకరోజు జైలు శిక్ష కోర్టు విధించిందని జిల్లా డ్రగ్ ఏడీ చంద్రరావు వెల్లడించారు. 2017లో విటమిన్–ఎ పెడియాట్రిక్ ఓరల్ సొల్యూషన్ ఐపీ మందు నమూనాను విశ్లేషణ నిమిత్తం ల్యాబ్‌కు పంపించగా నాణ్యత లోపం బయటపడిందన్నారు. హైదరాబాద్‌కు చెందిన సదరు కంపెనీ యజమానిపై అప్పట్లో అధికారులు కేసు నమోదు చేశారన్నారు. రెండేళ్లుగా 348 నమూనాలు సేకరించగా ఏడు నమూనాలు నాణ్యతా ప్రమాణాల్లో లోపం ఉండగా క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. నేరారోపణ రుజువైనందున శ్రీకాకుళం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.ఎం.జమ్మత్‌బేగం తీర్పు వెలువరించారని పేర్కొన్నారు.

34 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం టౌన్ : ఒడిశా నుంచి ముంబైకి 34.32 కిలోల గంజాయి తరలిస్తున్న సంతున్ దాసు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. పట్టణ ఎస్ఐ ముకుందరావు, పోలీసు సిబ్బంది మంగళవారం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్, చిదంబరీశ్వర ఆలయ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశా రాష్ట్రం ఖరియాగూడా ప్రాంతానికి చెందిన సంతున్‌దాసు అనుమానాస్పదంగా కనిపించడంతో లగేజీని తనిఖీచేశారు. అందులో 34.32 కిలోల గంజాయి ఉండటంతో అదుపులోకి తీసుకొని విచారించారు. తన గ్రామంలోని రైతుల వద్ద గంజాయి కొని ముంబైలోని లొటొకుండ అనే వ్యక్తికి అందజేసేందుకు వెళ్తున్నట్లు గుర్తించారు. గంజాయితోపాటు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు.



పట్టుబడిన నిందితుడితో పోలీసులు

ఎరువుల కృత్రిమ కొరత తగదు

ఆమదాలవలస : ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి రైతులను మోసం చేయడం కూటమి ప్రభుత్వానికి తగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు బస్తా యూరియా కోసం రోజూ గంటల తరబడి పనులు మానుకొని అధికారులు, ఆర్ఎస్‌కేల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలకు వస్తున్న ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయని, టీడీపీ నాయకులు ఎరువులను తమ ఇళ్ల వద్ద దాచుకొని బయట అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే కలెక్టర్ స్పందించి రైతుల కష్టాలు తీర్చాలని కోరారు. ఆమదాలవలస నియోజకవర్గంలో సాగు చేస్తున్న 53,000 ఎకరాల సాగుకు 2850 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ప్రభుత్వం 1600 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందన్నారు. పొందూరు మండలంలో 4000 ఎకరాల్లో సాగు చేస్తున్న మొక్క జొన్న పంటకు అదనంగా 600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమన్నారు. సీఎం చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇవేవీ పట్టకుండా విహార యాత్రలు చేస్తూ సొంత ఆదాయాలు చూసుకుంటున్నారని మండిపడ్డారు. సమావేశంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, నాయకులు సాకేటి శ్రీనివాసరావు, అన్నపు కృష్ణ, ధనుజయరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

రాష్ట్రస్థాయి పోటీల్లో దరహాస్ ప్రతిభ



పతకంతో దరహాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన స్విమ్మింగ్ క్రీడాకారుడు వేమకోటి ధనుష్య విజయవాడ కేంద్రంగా ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి మోడర్న్ పెంటాథ్లెన్ పోటీల్లో సత్తాచాటాడు. తేత్రాతలాన్ (స్విమ్మింగ్, షూటింగ్, ఫెన్సింగ్, రన్నింగ్) పోరులో 4వ స్థానంలో నిలవగా, రిలే (స్విమ్మింగ్, రన్నింగ్, షూటింగ్) విభాగంలో ప్రథమస్థానంలో నిలిచి శభాష్ అనిపించాడు. తద్వారా బంగారు పతకం సాధించి సెప్టెంబర్‌లో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. దరహాస్ ఎంపిక పట్ల స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హారికాప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎ.రూన్సీ, అంతర్జాతీయ వెటరన్ స్విమ్మర్ ఎస్.కాంతారావు, డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్‌రావు, డీఎస్ఏ కోచ్ మురళీధర్, మోడర్న్ పెంటాథ్లెన్ జిల్లా కార్యదర్శి చక్రదర్, ఒలింపిక్, పీఈటీ సంఘ నాయకు హర్షం వ్యక్తంచేశారు.

ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: ఒడిశాకు చెందిన విద్యార్థులకు ఫార్మా, హెల్త్ కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగాలు కల్పించేందుకు శ్రీకాకుళం బొల్లినేని మెడ్‌స్కిల్స్‌తో మంగళవారం ఎంఓయూ కుదుర్చుకున్నామని గజపతి జిల్లా డీఎస్‌డీఈవో సౌభాగ్య స్మృతిరంజన్ త్రిపాఠి తెలిపారు. ఎస్‌యూపీ ఒడిశా శిబిరంలో భాగంగా 240 మంది విద్యార్థులకు ప్రభుత్వ సహకారంతో శిక్షణ అందించనున్నామని పేర్కొన్నారు. ప్లస్ త్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు పేషెంట్ రిలేషన్ అసోసియేట్, ఎస్ఎస్‌సీ, ప్లస్ టూ, ప్లస్ త్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు అసోసియేట్ స్టోర్ ఫార్మా కోర్సులో శిక్షణ ఇస్తామని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి సదుపాయం, యూనిఫామ్ స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 7331118019, 7680945357, 7995013422 నంబర్లను గానీ, శ్రీకాకుళం రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గానీ సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, గజపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.



ఎంఓయూ కుదుర్చుకుంటున్న స్మృతిరంజన్, నాగేశ్వరరావు

దర్జాగా ప్రభుత్వ స్థలం కబ్జా

టెక్కలి: కోటబొమ్మాళి మండల కేంద్రంలో ప్రకాశ్ నగర్ కాలనీలో ప్రభుత్వ స్థలంలో అధికార పార్టీ కార్యకర్తలు కొంత మంది దర్జాగా అక్రమ నిర్మాణం చేస్తున్న విషయం అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు నివ్వెరపోతున్నారు. రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండటంతో కాలనీవాసులు స్పందించి సర్పంచ్ కాళ్ల సంజీవరావు సహకారంతో మంగళవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా ఆందోళన చేపట్టారు. ప్రకాశ్‌నగర్ కాలనీలో కొంత మంది అధికార పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, దీనిపై చర్యలు చేపట్టకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా ఆందోళన బాట పడతామంటూ హెచ్చరించారు.



కోటబొమ్మాళి ప్రకాశ్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

రైలు ఢీకొని యువకుడు మృతి

నరసన్నపేట : కామేశ్వరిపేట సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఓ వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మంగళవారం ఉదయం ఉర్లాం రైల్వేస్టేషన్ మాస్టర్ నుంచి సమాచారం రావడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడు శ్రీకాకుళం టౌన్ బలగ పరిధిలోని బుచ్చిపేటకు చెందిన జడుగుల చిట్టిబాబు(31)గా గుర్తించినట్లు హెచ్‌సీ మధుసూదనరావు తెలిపారు. ప్రమాద కారణాలు తెలియాల్సి ఉందన్నారు. సోమవారం సాయంత్రం రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.



ట్రాక్ వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కాపుగోపాలపురంలో చైన్‌స్నాచింగ్



బాధితురాలు కాళ్ల జ్యోతి

పాతపట్నం : చైన్‌స్నాచర్లు రెచ్చిపోతున్నారు. ఒంటరిగా వెళ్లే మహిళలే లక్ష్యంగా దాడులకు ఎగబడుతున్నారు. పాతపట్నం మండలం కాపు గోపాలపురంలో సోమవారం సాయంత్రం చైన్‌స్నాచింగ్ చోటుచేసుకుంది. పాతపట్నం మేజర్ పంచాయతీ కోటగుడి కాలనీకి చెందిన దంపతులు కాళ్ల జ్యోతి, నారాయణరావులు పశువులకు కుడితి పెట్టడానికి కాపుగోపాలపురంలోని నీలకంఠేశ్వర ఆలయం సమీపంలోని పశువులశాల వద్దకు బైక్‌పై వెళ్లారు. భార్యని దించేసి నారాయణరావు కాపుగోపాలపురం వచ్చేశారు. జ్యోతి పశువుల శాల వైపు కుడితి పెట్టడానికి బకెట్‌తో వెళుతుండగా వెనుక నుంచి బైక్‌పై ఇద్దరు దొంగలు వచ్చి పుస్తెలతాడు లాక్కెళ్లారు. జ్యోతి కేకలు వేసేసరికే పర్లాకిమిడి వైపు పారిపోయారు. రెండు తులాల బంగారు పుస్తెలతాడు చోరీ జరిగిందని బాధితురాలు వాపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు.

నేడు ఎన్‌వైకేలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని నెహ్రూ యువకేంద్రం వేదికగా బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ఎన్‌వైకేలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో అపోలో ఫార్మసీ, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ సంస్థల్లో ఖాళీలు భర్తీ చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, 3 ఫోటోలతో జాబ్‌మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.